వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

మంగళవారం 13 డిసెంబర్ 2022

స్పందన ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

- స్పందనలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప క్రైం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ స్పందన కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్సు ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

బహుదా ప్రాజెక్టుకు వరద పోటు

వాల్మీకిపురం, డిసెంబరు 12 ప్రభాతవార్తః

మూరేవాండ్లపల్లె మీదుగా బహుదానది ప్రవహిస్తుంది. గత రెండు సంవత్సరాల నుంచి వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడం, బహుదా ప్రాజెక్టు వరుసగా నిండి గేట్లని ఎత్తుతుండటంతో ఈవరద నీటి ఉధృతికి మూడేవాళ్లపల్లె బ్రిడ్జి 50 శాతం దెబ్బతినిపోయింది. ప్రస్తుతం మాండోస్ తుఫాన్ దాటికి గత మూడు రోజుల నుంచి ఎడతెరపి లేని వర్షాలు కురుస్తుండటంతో నిమ్మనపల్లె బహుద ప్రాజెక్టు వరదపోటు పెరిగింది. దీంతో ప్రాజెక్టు నిండిపోవడంతో సోమవారం నాటికి మూడు ప్రధాన గేట్లను ఎత్తివేయడంతో లోతట్టులో ఉన్న బహుద నదిపై వరదనీరు పెరుగుతూ వస్తుంది. దీంతో మూరేవాండ్లపల్లె బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుంది. ఈబ్రిడ్జి ప్రమాదపు అంచున ఉండడంతో స్థానిక ఎస్సై బిందు మాధవి పర్యవేక్షణలో బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను సోమవారం ఉదయం నుంచి నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా ముళ్లకంపలు వేసి రోడ్డును మూసివేశారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి బ్రిడ్జిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. వాల్మీకిపురం పట్టణ ఎగువున ఉన్న రెడ్డికుంట నిండిపోవడంతో పట్టణ నడిబొడ్డున ఉన్న డిగ్రీ కళాశాల సమీపంలో మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై మొరవపోతుంది. అంతకంతకు ఇక్కడ మొరవ పెరుగతూ వస్తుంది.

మండూస్ ప్రభావిత ప్రాంతాలల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలి

పంటలు, ఆస్తి నష్టం వివరాల నివేదికలను వెంటనే సిద్ధం చేయాలి

కలెక్టర్, ఎస్పీలతో ముఖ్యమంత్రి విడియో కాన్ఫరెన్స్

కడప, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

జిల్లాలో మండూస్ తుఫాను వల్ల జరిగిన నష్ట వివరాలను తక్షణమే సేకరించి ప్రాథమిక నివేదికలు పంపించాలని, అలాగే యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులను చేపట్టాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి మాండూస్ తుపాను, భారీ వర్షాలపై జిల్లా కలెక్టర్ లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వి.సి.హాలు నుండి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జిల్లా ఎస్పీ అన్బురాజన్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్వో గంగాధర గౌడ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. రాష్ట్రంలో మండూస్ తుఫాను ప్రభావం అధికంగా ఉన్న జిల్లాల్లో పరిస్థితులపై ఆయా జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం.. స్థానిక విసి హాలులో హాజరైన వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మండూస్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై అధికారులు అప్రమత్తంగా వుండడంతో పాటు.. అత్యవసర సహాయక చర్యలు, పునరుద్ధరణ చర్యలను తక్షణమే చేపట్టాలన్నారు. అధిక వర్షాల ధాటికి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, బోర్లు, విద్యుత్ మోటార్లు, స్తంభాలు, మంచినీటి సరఫరా వ్యవస్థ తదితర వాటిని.. తక్షణమే పునరుద్ధరింపచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టం, పశునష్టం, ఇళ్లు తదితర ప్రభుత్వ భవనాలకు జరిగిన నష్ట వివరాలు సేకరించి ఎంతమేర నష్టం వాటిల్లిందో ప్రాథమిక అంచనాలు సిద్ధం చేయాలన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో.. ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా, తాగునీరు కలుషితం కాకుండా.. చర్యను చేపట్టాలన్నారు. అన్ని గ్రామవార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది ప్రజారోగ్య భద్రతపై దృష్టి సారించాలన్నారు. నదులు, కాల్వలు, చెరువులు, నీటి కుంటలు, బావుల వద్దకు చిన్నపిల్లలు వెళ్ళకుండా నిఘా ఉంచాలన్నారు. రిజర్వాయర్లు, చెరువుల వద్ద నీటి మట్టాలపై ఇరిగేషన్ అధికారులు, పంచాయతీ సెక్రెటరీలు, విఆర్వోలు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, పీఆర్, ఆర్.డబ్ల్యు.ఎస్., విద్యుత్ తదితరుల శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మదనపల్లె డివిజన్‌లో ఎడతెరపులేని వర్షం

పట్టణంలో రోడ్లన్నీ జలమయం - పొంగి పొర్లుతున్న బాహుదా ప్రాజెక్టు

వర్షంతో దెబ్బతింటున్న పంటపొలాలు

పొంగిపొర్లుతున్న బాహుదా, పట్టణంలో జలమయమైన రోడ్లు, వర్షంతో నేలకొరిగిన వరిపంట

మదనపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

మాండూస్ తుఫాన్ ప్రభావంతో గత మూడు రోజులుగా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌పరిధిలో ఎడ తెరపులేని వర్షం పడుతోంది. దీంతో పంటపొలాలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. పట్టణంలో రోడ్లన్నీ జలమయమైనాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎడతెపులే ని వర్షం పడు తుండడం వల్ల నిమ్మనపల్లె వద్ద ఉ న్న బాహుదా ప్రాజెక్టు పొంగిపొర్లుతోంది. ముంద స్తుగా ఇరిగేషన్ అధికారులు 400కిసెట్ల నీటిని విడుదల చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు డివిజన్ పరిధిలోని చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. ఇదే వర్షం కొనసాగితే చెరువుల న్నా మొ వలు పోయే సూచనలు ఉన్నాయంటూ అధికారులు చెబుతున్నారు. అధికారులు ముందస్తు గా చెరువులు అన్నింటిని పరిశీలించి గండ్లుపడే చెరువులను మరమ్మత్తులకు చర్యలు చేపడుతున్నారు. బాహుదా, బుగ్గకాలువ, కురవంక ముంపు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్ష ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే వర్షం వల్ల రెవెన్యూ డివిజన్ పరిధిలో సుమారు 250హెక్టార్లు వరిపంట దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక రోడ్లు కూడా ఓ మోస్తారుగా దెబ్బతిన్నాయి. ఎటు చూసినా గుంతలు పడిన రోడ్లే దర్శ నమిస్తున్నాయి. చలి, ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతుండ దం వల్ల వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరపులేని వర్షం పడుతుండడం వల్ల ప్రభుత్వ కార్యాలయాలు సైతం ఉరుస్తున్నాయి. పట్టణంలో వర్షపునీటితో ఆటోలు సైతం తిరిగేందుకు ఇబ్బందులు పడుతూ కాలువల్లో చిక్కుకొంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడు రోజులు పాటు నిరవధికంగా వర్షం పడడం వల్ల ప్రజాజీవనం స్థంభించిపోయింది. కూలిపనులు చేసుకునే సామాన్య ప్రజలు వర్షం వల్ల ఇబ్బందులు పడుతూ నిత్యవసర సరుకుల కోసం అనేక అగచాట్లు ఎదుర్కొంటున్నారు. అధికారులు తుఫాన్ బాధితులకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. అదే విధంగా వర్షం వల్లనష్టపోయిన రైతాంగానికి పరిహారం కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. రూరల్ మండలంలోని చెరువులు నిండుకుండలా తలపిస్తున్నాయి. ఎప్పుడు పొంగి పొర్లుతాయో నంటూ అధికారులు సైతం ఆందోళన చెందుతున్నారు. వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే వారికి సబ్‌కలెక్టరేట్, మున్సిపల్, మండల పరిషత్ కార్యాలయాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమవారం ఆర్డీఓ ఎంఎస్ మురళి, తహశీల్దార్ సికె.శ్రీనివాసులు తుఫాన్ పరిస్థితులను పరిశీలించారు.

యదేచ్ఛగా నకిలీ ఫర్టిలైజర్, క్రిమిసంహారక మందుల దందా

అధికారులు మెరుపు దాడులు

12 రకాల నకిలీ ఫర్టిలైజర్స్ ప్యాకెట్లు స్వాధీనం

ప్రొద్దుటూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

ప్రొద్దుటూరు కేంద్రంగా నకిలీ ఫర్టిలైజర్, క్రిమి సంహారక మందుల దందా యదేచ్ఛగా కొనసాగుతోంది. సోమవారం ఉదయం అధికారులు మెరుపు దాడులు చేసి దాదాపు తొమ్మిది లక్షల రూపాయలు విలువ చేసే 12 రకాల నకిలీ ఫర్టిలైజర్, క్రిమి సంహారక మందులను సీజ్ చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే ప్రొద్దుటూరు పట్టణం లోని ప్రొద్దుటూరు మిల్క్ ఫ్యాక్టరీ (పిఎంఎఫ్) కేంద్రంగా హరినాథ్ రెడ్డి అనే వ్యక్తి నకిలీ క్రిమి సంహారక మందులు ఫర్టిలైజర్ల దందా ఎదేచ్ఛగా కొనసాగిస్తు, బెంగళూరు హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి ముడి సరుకు కొనుగోళ్లు, కల్తీ చేసిన పలు రకాల ఫర్టిలైజర్లు నకిలీ బ్రాండ్ల పేర్లతో రాయలసీమలోని అన్ని జిల్లాలకు సరఫరా. సోమవారం ఉదయం అధికారులు నిర్వహించిన మెరుపు దాడులలో విస్తు పోయే నిజాలు బయటికి వచ్చిన వైనం. లక్షల్లో విలువ చేసే పలు రకాల ఫర్టిలైజర్లు, ఛత్తీస్గఢ్, బీహార్ నుంచి కూలీలను రప్పించి ఇక్కడ యదేచ్ఛగా కల్తీ చేస్తూ, రైతులకు నాసిరకం మందులను సరఫరా చేస్తూ, అటు రైతును ఇటు వ్యాపారులను దగా చేస్తూ, కోట్లలో సాగుతున్న అక్రమ దందా. ఎటువంటి ట్రేడ్ మార్కు, లైసెన్సు లేకుండా గత కొద్ది నెలలుగా యదేచ్ఛగా కొనసాగుతున్న ఈ దందాకు నేటితో అధికారులు చరమగీతం పాడనున్నారా లేక రైతులను నిట్ట నిలువునా ముంచి దిగుబడి తగ్గించే ఇలాంటి నకిలీ మందుల ఫర్టిలైజర్ల వ్యాపారలను చూసి చూడనట్లు వదిలేస్తారా వేచి చూడాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా లాంటి పథకాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు చేరువై పంటకు కావలసిన అన్ని రకాల సూచనలను సలహాలను ఇస్తూ ఉండగా, ఇలాంటి నకిలీ దందాలకు పాల్పడుతున్న కల్తీ ముఠాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం పేరు అప్రతిష్టల పాలవుతోంది.

మైనర్ బాలికపై అత్యాచారం,

హత్య కేసులో జీవిత ఖైదు

- వైఎస్ఆర్ జిల్లా మొదటి అదనపు జడ్జీ మరియు పోక్స్ ప్రత్యేక కోర్టు

- దోషికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అభినందించిన ఎస్పీ

కడప క్రైం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

జిల్లాలోని చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలోని కొప్పర్తి గ్రామంలో 2016లో మైనర్ బాలిక(6)పై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన కేసులో ముద్దాయి బోనాల ఓబయ్య అలియాస్ ఓబన్న(50)ని దోషిగా నిర్ధారిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జీ మరియు పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జీ సి.ఎన్.మూర్తి జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చారు. కేసు వివరాలు.. 2016 మార్చి నెలలో సి.కె.దిన్నె పోలీసు స్టేషన్ పరిధిలోని కొప్పర్తి గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ తప్పిపోయినట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అనంతరం అత్యాచారం, హత్య, పోక్సో కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అదే గ్రామానికి చెందిన బోనాల ఓబయ్య చాక్లెట్ ఆశ చూపి తన ఇంటికి తీసుకెళ్లిన బాలికపై అత్యాచారం చేసి హత్య చేసి శవాన్ని ఊరి బయట గల జింకల వంకలో పూడ్చిపెట్టినట్లు పోలీసులు గుర్తించారు. కేసును అప్పటి నుంచి రూరల్ సీఐ, ప్రస్తుత డీఎస్పీ వెంకట శివారెడ్డి పకడ్బందీగా శాస్త్రీయంగా దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ప్రాసిక్యూషన్ తరుపున అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జయలక్ష్మి, ప్రస్తుతం విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ వానదలు వినిపించారు. సోమవారం వైఎస్ఆర్ జిల్లా మొదటి అదనపు జడ్జీ మరియు పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జీ మూర్తి ముద్దాయిపై ఆరోపణలు రుజువు కావడంతో జీవిత ఖైదు, అత్యాచారం (376 ఐపీసీ) కింద జీవిత ఖైదు, అత్యాచారం (376 ఐపీసీ) మరియు సెక్షన్ 5, 6 పోక్సో చట్టం నేరం కింద 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, శవాన్ని కనిపించకుండా చేసినందుకు మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పీపీఎస్ రామసుబ్బారెడ్డి హాజరయ్యారు. దోషికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

పంటలు దెబ్బతిన్న పంటలు వేసుకోవడానిక 80శాతం సబ్సిడితో విత్తనాలు అందించాలి

-వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌లను ఆదేశించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

రాయచోటి.డిసెంబర్ 12 ప్రభాతవార్త

తుఫాన్ బాధితులు పట్ల కలెక్టర్‌లు అధికారులు అత్యంత మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ముఖ్యమ ంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి మాండూస్ తుఫాన్, భారీ వర్షాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎన్యుమరేషన్ విషయంలో ఉదారంగా వ్యవహరించాలన్నారు. ఎక్కడా కూడా రైతులు నిరాశకు గురి కాకూడదన్నారు. రంగుమారిన ధాన్యమైనా, తడిసిన ధాన్యమైనా కొనుగోలు చేయలేదన్న మాట ఎక్కడా రాకూడదన్నారు. తక్కువ రేటుకు కొంటున్నారన్నమాట ఎక్కడా కూడా వినపించకూడదన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు కురిసిన జిల్లాల్లో కలెక్టర్‌లు అందరూ దీని కోసం చర్యలు తీసుకోవాలన్నారు. పంటలు దెబ్బతిన చోట మళ్లీ పంటలు వేసుకోవడానికి 80 శాతం సబ్సిడితో విత్తనాలు అందించాలన్నారు. పంటలు దెబ్బతిన్నా, ఎక్కడైనా ఇళ్లు ముంపునకు గురైతే ఆ కుటుంబానికి 2 వేలతో పాటు రేషన్ అందించాలన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌లు అంతా దృష్టిలో ఉంచుకుని పట్టణాలు, పల్లెలతో సంబంధం లేకుండా ఈ సహాయాన్ని బాధితులందరికి అందించాలన్నారు. వారం రోజుల్లో ఈ సహాయం అంతా వారికి అందాలన్నారు. నష్టపరిహారం అంచనాల నమోదును వెంటనే ప్రారంభించాలన్నారు. వచ్చే వారం రోజుల్లో ఈ ప్రక్రియ ముగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆమోదయోగ్యంగా అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తాం : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్.డిసెంబర్ 12 ప్రభాతవార్త

అందరికి ఆమోదయోగ్యమైన స్థలంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వైఎస్సార్‌సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రాయచోటి తహశీల్దార్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజాసంఘాలు చేస్తున్నదీక్షలను సోమవారం, ఆయన సందర్శించారు. ప్రజా సంఘాల నాయకులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు వషయంలో చిత్తశుద్ధితో ఉన్నామన్నారు. తల్లిదండ్రుల తర్వాత వ్యవస్థలను ప్రతి ఒక్కరు గౌరవించాలని, భేషజాలకు పోకుండా అందరికి ఆమోదయోగ్యమైన స్థలంలో అందరి అనుమతులతో సుందరంగా ఆ మహనీయుని విగ్రహాన్ని సమిష్టిగా ఏర్పాటు చేద్దామన్నారు. జిల్లా కేంద్రమయిన రాయచోటిలో అంబేద్కర్ విగ్రహంతో పాటు మహాత్మాగాంధీ, జ్యోతిరావ్‌పూలే, అబ్దుల్ కలాం విగ్రహాలును త్వరలోనే ఏర్పాటు చేస్తామని, ఇందుకు మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష, వైస్‌చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైఎస్సార్‌సిపి మదనపల్లి నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లా ఖాన్, బేపారి మహమ్మద్‌ఖాన్, మదనమోహన్‌రెడ్డి, ఆసీఫ్ అలీఖాన్, కొలిమిచాన్‌బాష, జాకీర్, ఫయాజ్‌అహమ్మద్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యామ్, రియాజ్, షబ్బీర్, జానం రవీంద్రయాదవ్, ఇర్ఫాన్, మురికినాటి వెంక ట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాండూస్ బీభత్సంతో

9299 హెక్టార్లలో పంట నష్టం

- ఈ క్రాపింగ్ చేయకపోవడంతో రైతల గుండెల్లో మొదలైన తుఫాన్

కమలాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

కమలాపురం మండలం గంగవరం, విభరాపురం, సంబటూరు గ్రామాల్లో మాండూస్ తుఫాన్ ప్రభావం తాకిడికి జరిగిన పంట నష్టంపై క్షేత్ర స్థాయి పరిశీలనకు అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ జిల్లా స్థాయిలో పంట నష్టం పరిశీలన స్వయంగా పర్యవేక్షించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులను ఆదేశించగా, ఆయన ఆదేశాల మేరకు కమలాపురం సహాయ, వ్యవసాయ సంచాలకులు ఏవీ నరసింహారెడ్డి, మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి, ఎంఏఓ పి.దస్తగిరి, ఏఈఓ కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన డా.వీరయ్య, ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డా.మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు వెంకటకృష్ణ, వీఏఏ వీఆర్వో, పీఎస్ మరియు గంగవరం, విభరాపురం, సంబటూరు గ్రామాల రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మినుము పంటలో బూడిద మరియు ఆకుమచ్చ తెగుళ్లు ఉన్నాయని వాటి నివారణకు హెక్సా కొనజోల్ 2 ఎంఎల్ మరియు 13 0 45 10 గ్రాముల లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ముందుగా వేసిన మరియు కోతకు సిద్ధంగా ఉన్న మినుము పంట వర్షాల కారణంగా దెబ్బతినడం గమనించినట్లు తెలిపారు. అలాగే శనగ పంటలో అధిక వర్షాల కారణంగా కాండం మరియు వేరుకుళ్లు తెగుళ్లు వచ్చే అవకాశం ఉన్నదని దాని నివారణకు హెక్సాకోనజోల్ 2 ఎంఎల్, 13.0.45 10 గ్రాముల ఒక ఎకరాకు చొప్పున కలిపి పిచికారి చేసుకోమని తెలిపారు. కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలో 8536 హెక్టార్ల బుడ్డశనగ 651 హెక్టార్ల మినుము 112 హెక్టార్లలో వరి పంటలు నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేసి ఉన్నతాధికారులు పంపించామని తెలిపారు.

ఎట్టకేలకు కడప స్టీల్‌ప్లాంట్‌కు 8500 కోట్లతో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

జెఎస్‌డబ్ల్యు స్టీల్‌ప్లాంట్ ప్రతిపాదనకు ఎస్ఐపిబి ఆమోదం

సిఎం అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో నిర్ణయం





జగన్ సిఎం అయ్యాక కడప స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కార్యక్రమం, రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం కడప స్టీల్‌ప్లాంట్ పనులు దక్కించుకొన్న జెఎస్‌డబ్ల్యు స్టీల్‌ప్లాంట్ దృశ్యం

రాజంపేట అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త

ఎట్టకేలకు కడప గడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు జగన్ సర్కార్ పచ్చజెండా ఊపింది. 8500 కోట్ల వ్యయంతో జెఎస్‌డబ్ల్యు సంస్థ ఏర్పాటు చేసే స్టీలుప్లాంట్ ప్రతిపాదనకు రాష్ట్ర పెట్టుబడుల ప్రమోషన్ బోర్డు(ఎస్ఐపిబి) ఆమోదం తెలిపింది. జెఎస్‌డబ్ల్యు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో కడప జిల్లా సున్నపురాళ్లపల్లెలో స్టీలుప్లాంటును 8500 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తామని జెఎస్‌డబ్ల్యు సంస్థ ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనకు ఆమోదించారు. మొదటి విడతలో 3300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ప్రతిపాదనలో పేర్కొంది. మొదటిదశలో యేడాదికి ఒక మిలియన్ టన్నుల స్టీలు ఉత్పత్తులు రెండోవిడతలో యేడాదికి 2 మిలియన్ టన్నుల స్టీలు ఉత్పత్తులు మొత్తానికి 3 మిలియన్ టన్నుల ఉత్పత్తులు చేస్తామని సంస్థ పేర్కొంది. జెఎస్‌డబ్ల్యు గ్రూపుకు కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీష్‌ఘడ్, ఒరిస్సాల్లో కర్మాగారాలు కూడ ఉన్నాయి. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యంగానైనా కడప స్టీలు ప్లాంటు ఏర్పాటుకు మార్గం సుగమమం చేసింది. వైఎస్ హయాంలో కర్ణాటక మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి బ్రహ్మణి స్టీలు పేరుతో కడప స్టీలు ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగింది. ఆ తర్వాత ఆయన మరణంతో అటకెక్కింది. ఆ తర్వాత చంద్రబాబు హయాంలో కూడ కడప స్టీలు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. తాజాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కడప స్టీలు ప్లాంట్ పేరును రాయలసీమ స్టీలుప్లాంటుగా నామకరణం చేశారు. స్టీలు ప్లాంటు ఏర్పాటుకు స్పెషల్ పర్పస్ వెహికల్‌ను కూడ ఏర్పాటు చేశారు. 3149 ఎకరాలను స్టీలుప్లాంటు కోసం కేటాయించారు. 47 కోట్ల రూపాయల నిధులు భూసేకరణ కోసం ఖర్చు చేశారు. ఒకదశలో ఎస్ఆర్ స్టీలు గ్రూప్, లిబర్టి స్టీలు గ్రూప్ కంపెనీలు జాయింట్ వెంచర్‌గా మారి స్టీలు ప్లాంటు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కాని 2 సంస్థలు వెనక్కు తగ్గాయి. ఇప్పటికే స్టీలు ప్లాంటు ఏర్పాటు చేసే ప్రాంతానికి ఎన్‌హెచ్-67 కనెక్టివిటి కల్పించారు. అలాగే 250 కోట్ల నిధులను గతంలో ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. రైల్వే కనెక్టివిటి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం రైల్వేబోర్డుకు దరఖాస్తు చేసింది. పర్యావరణ అనుమతికి కూడ దరఖాస్తు చేసి ఉన్నారు. ఈ ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేస్తే జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా ఉపాది కల్పించవచ్చు. రాయలసీమ ముఖ చిత్రాన్ని ఉక్కు పరిశ్రమ పూర్తి చేయడం ద్వారా మారే అవకాశాలు కూడ లేకపోలేదు. అయితే కావాల్సిందల్లా ప్రభుత్వ చిత్తశుద్ధి. ఎన్నికలకు 16 నెలల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం విమర్శలకు తావిస్తున్నా ప్రఖ్యాత కంపెనీగా జెఎస్‌డబ్ల్యుకు పేరుంది. మరలా స్టీలు ప్లాంట్‌ను ప్రారంభించేందుకు ఎప్పుడు ముహూర్తం నిర్ణయిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ఐచర్ వాహనం స్కూటర్ ఢీ

వాలంటీర్ శివారెడ్డి మృతి - మహిళకు తీవ్రగాయాలు

మండూస్ ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలి

టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయ్‌రామరాజు

పంటలు ఆస్తి నష్టం వివరాల నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశాలు

కడప, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

జిల్లాలో మండూస్ తుఫాను ప్రభావిత ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. పంటలు, ఆస్తి నష్టం వివరాలను తక్షణమే సిద్ధం చేసి నివేదించాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. మండూస్ తుఫాను ప్రభావంతో శుక్రవారం నుండి జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో.. జిల్లాలో పరిస్థితిపై.. సోమవారం ఉదయం కలెక్టర్ విజయ్ రామరాజు సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎక్కడైనా అత్యవసర సహాయక చర్యలు అవసరమైతే.. అధికారులు తక్షణమే స్పందించడంతో పాటు అధిక వర్షాల ధాటికి దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, బోర్లు, విద్యుత్ మోటార్లు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి సరఫరా వ్యవస్థ తదితర వాటిని.. తక్షణమే పునరుద్ధరింపజేసి జనజీవనానికి ఎలాంటి ఆటంకం లేకుండా ఆర్ అండ్ బి, పీఆర్, ఆర్.డబ్ల్యు.ఎస్., విద్యుత్ శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టం, పశునష్టం, ఇళ్లు, తదితర శాఖల్లో జరిగిన నష్టం వివరాలు సేకరించి ఎంతమేర నష్టం వాటిల్లిందో ప్రాథమిక అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాను

ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి అంటువ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా.. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని గ్రామ, పట్టణ ప్రాంతాల్లో.. పారిశుధ్యం లోపించకుండా జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు.. గ్రామ స్థాయిలో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ, పంచాయతీ, శానిటేషన్ సిబ్బంది తాగునీరు కలుషితం కాకుండా అన్ని తాగునీటి పథకాల ట్యాంకుల్లో క్లోరిన్ బాల్స్ వేయాలని, మురికి నీటినిల్వ ఉన్న చోట్ల దోమలు వ్యాప్తి చెందకుండా గంబుజియా చేపలు వదలడం, ఆయిల్ బాల్స్ వేయడం వంటి చర్యను చేపట్టాలన్నారు. అన్ని గ్రామవార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది ప్రజారోగ్య భద్రతపై దృష్టి సారించాలన్నారు. నీటి కుంటలు ఉన్న ప్రాంతాల్లో చిన్న పిల్లలను ఆడుకోవడానికి వెళ్లకుండా ఇంట్లో పెద్దలు జాగ్రత్తగా ఉండమని చెప్పడంతో పాటు నదులు, కాల్వలు, చెరువులు, బావుల వద్ద పిల్లలు వెళ్లకుండా నిఘా ఉంచాలన్నారు. రిజర్వా యర్లు, చెరువుల వద్ద నీటి మట్టాలపై ఇరిగేషన్ అధి కారులు, పంచాయతీ సెక్రెటరీలు, విఆర్వోలు, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఏ సమయంలో సహాయక చర్యలకు అవసరం అయినా.. సేవలు అందించేందుకు పోలీసు, రెవెన్యూ, ఫైర్, విఫత్తుల నిర్వహణ, రెస్క్యు టీమ్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా.. జిల్లా కలెక్టరేట్ తో పాటు.. రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పాటు చేయిన కంట్రోల్ రూమూల నెంబర్లను ప్రజలకు తెలియజేయాలన్నారు.

మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ స్కూలు విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

జమ్మలమడుగు మహాత్మ జ్యోతి రావు పూలే బీసీ స్కూలు విద్యార్థులు డిస్క్రత్లోలో ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపల్ కె.వి.ఎస్.రామకృష్ణారెడ్డి తెలిపారు. అండర్-17 విభాగంలో డిస్క్ త్రోలో ఎం.సుబ్బ రాయుడు, హ్యామర్ త్రోలో పి.నాగమల్లేష్ ప్రతిభ చూపి కడపలో ఈనెల 8వ తేదీన కడప స్పోర్స్ స్కూల్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ నందు జిల్లా స్థాయిలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు రవికేశవ అభినందించారు.

శ్రీగంగమ్మతల్లి 9వ వార్షికోత్సవం

కమలాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

సోమవారం కమలాపురం పట్టణం లోని 14వ వార్డు రాంగనర్‌కాలనీలో ఉండే శ్రీరంగమ్మ తల్లి 9వ వార్షికోత్సవ సందర్భంగా రామ్‌నగర్ కాలనీ వాసుల ఆహ్వానం మేరకు శ్రీరంగమ్మ తల్లిని దర్శించి ప్రత్యేక పూజలు చేసిన తెలుగు నాడు ప్రజా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల సాయినాథ్‌శర్మ తనయుడు కాశీభట్ల మణికంఠ శర్మ తదనంతరం ఆలయ పెద్దలు మణికంఠశర్మను సత్కరించగా తదనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలిక వసతి గృహంలో వైద్య పరీక్షలు

కమలాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

కమలాపురం పట్టణంలో ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, బీసీ కళాశాల, బీసీ వసతి గృహాలలో విద్యార్థినిలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కమలాపురం సహాయ సాంఘిక సంక్షేమ అధికారి స్వర్ణలత, డాక్టర్లు బస్వంత్‌కుమార్, అపు రూప, కొండారెడ్డి, ల్యాబ్ టెక్నిషియన్, కళాశాల హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

కమలాపురం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

వైఎస్ఆర్ జిల్లా పార్టీ కార్యాలయం లో కమలాపురం నియోజకవర్గానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.29.66లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

స్పందన దరఖాస్తులను పరిష్కరించాలి

దువ్వూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

మండలంలో వివిధ శాఖల అధికారులకు వచ్చే స్పందన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు రమాకుమారి ప్రజల నుంచి వచ్చిన వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజల నుంచి ఎక్కువగా ఏ సమస్యలు వస్తున్నాయో వాటికి పరిష్కారం చూపాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారులు విధుల్లో ఆల స్యం చేయకుండా నివేదికలు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు, ప్రజలకు ఇచ్చే ద్రువీ కరణ పత్రాలు గ్రామ సచివాలయాల ద్వారా త్వరితగతిన అందించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులుగా శివకుమార్

బ్రహ్మంగారి మఠం, డిసెంబరు 12 ప్రభాతవార్త :

వ్యవసాయ కార్మిక సంఘం కడప జిల్లా అధ్యక్షులుగా ఉన్న బ్రహ్మంగారి మఠంకు చెందిన గండికోట శివ కుమార్‌ను ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో 3 రోజుల పాటు జరిగిన సంఘం 29వ రాష్ట్ర మహాసభలలో జాతీయ నాయకత్వం సమక్షంలో రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే ఫిబ్రవరిలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జరిగే అఖిల భారత మహాసభలకు ప్రతినిధిగా కూడా ఎన్నుకున్నట్లు తెలిపారు.

యువ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

బద్వేలు రూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :

గౌరీ శంకర్ యువ పురస్కారం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అఖిల భారతీయ విద్యా పరిషత్ ఏబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అఖిలేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబివిపి ఆంధ్రప్రదేశ్ 41వ రాష్ట్ర మహాసభలు కర్నూలు నగరంలో 23, 24, 25 తేదీలలో జరుగుతున్నాయని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సమాజ సేవకే తమ జీవితాన్ని అర్పించిన గౌరీ శంకర్ (గురూజీ) పేరు మీద ప్రతి సంవత్సరం పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. సమాజంపై సానుకూల భావం చూపే సేవా కార్యకర్తలు నూతన ఆవిష్కరణలు, ఇతర ప్రముఖ రంగాలలో విశేష కృషి చేస్తూ ఇతర యువతీ, యువకులకు స్ఫూర్తిగా నిలిచే 40 సంవత్సరాల లోపు వయసు కలిగిన ఆదర్శ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలియజేశారు. ఈ అవార్డు క్రింద 25 వేల రూపాయలు నగదు, ప్రశంసా పత్రం, మెమెంటో అందజేస్తున్నామన్నారు. దరఖాస్తుదారులు తమ పూర్తి బయోడేటా, చేస్తున్న కార్యక్రమాల వివరాలు ఈ నెల 15వ తేదీ లోపు 9441091813 నెంబరును సంప్రదించి పంపించాలని వారు తెలిపారు.

గ్రీవెన్‌సెల్ అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్.డిసెంబర్ 12 ప్రభాతవార్త

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రామాపురం స్టోన్ క్రసర్స్ అసోషియేషన్ సౌజన్యంతో సోమవారం నాడు జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు వచ్చిన అర్జీదారులు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌లోనూ, ఎస్పి కార్యాలయంలోను ప్రతి సోమవారం జరిగే గ్రివెన్‌సెల్ లలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోసం వస్తున్న ప్రజల సౌకర్యార్థం దృష్ట్యా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని పున:నిర్మించాలి

ఓబులవారిపల్లె, డిసెంబరు 12, ప్రభాతవార్త:

భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ జ్ఞాని డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాత్రికి రాత్రే రాయచోటి తహసీల్దారు కార్యాలయం ఎదుట మాయం చేశారని, అదే స్థానంలో అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించాలని జేఏసీ నాయకులు, లాయరు, అధికారులు తెలిపారు. అంబేద్కర్ స్థానాన్ని నిర్మించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి స్పందించి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

వంక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు వినతి

కడప కార్పొరేషన్, డిసెంబరు 12, ప్రభాతవార్త:

మఠం వంకను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కేఎస్ మహబూబ్‌బాషా జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో అధి కారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాజీపేట మండలం, సర్వర్‌ఖాన్‌పేటలోని మఠం వంకలో సుమారు 34 సెంట్లు అక్రమంగా కొంత ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రాజకీయ అండదండలు చూసుకొని వంకలో మట్టి తోలి దౌర్జన్యానికి పాల్పడుతున్నారన్నారు. మఠం కాలువ వంక ఆక్రమణకు గురి కావడంతో నీరు సక్రమంగా ప్రవహించడం లేదన్నారు. స్థానిక నివాస గ్రామ గృహంలోకి నీరు ప్రవేశిస్తోందని బాధను వ్యక్తం చేశారు. దీని కారణంగా గృహస్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. గతంలో జిల్లా ఎస్పీకి కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎమ్మార్వో కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. పైగా బెదిరించారని ఆరోపించారు. వంక ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు.

వై.కోట చెరువు అలుగు లీకేజీ

ఓబులవారిపల్లె, డిసెంబరు 12, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం వై.కోట గ్రామంలో ఉన్న చెరువు అలుగు లీకేజీ అయిందని గ్రామస్థులు, సీపీఐ నాయకులు జయరామయ్య తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు కుండ పోతగా మారి అలుగు కింద భాగంలో లీకేజీ అయ్యి నీరు వృథాగా పోతోందన్నారు. మళ్లీ ఎక్కువ వర్షాలు కురవడంతో ఎక్కడ చెరువుకు గండి పడుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు స ్పందించి అలుగు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

స్పందన అర్జీలను పరిష్కరిస్తాం

- కమిషనర్ సూర్యసాయిప్రవీణ్ తేజ్

కడప కార్పొరేషన్, డిసెంబరు 12, ప్రభాతవార్త:

స్పందనకు వచ్చిన ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరిస్తామని కడప నగరపాలక సంస్థ కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ తేజ్ పేర్కొ న్నారు. యథావిధిగా సోమవారం నగరపాలక సంస్థలో జరిగిన స్పందన కార్యక్రమంలో నగరవాసుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆక్రమణలు తొలగిస్తున్నామని తెలిపారు. రోడ్లను విస్తరిస్తు న్నట్లు పేర్కొన్నారు. కాలంలో మురికిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు చెప్పారు. వర్షపు నీరు సక్రమంగా ప్రవహించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణఆరెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు విజయభాస్కర్ గౌడ్, కన్నయ్య, డీఈలు వేణుగోపాల్, రాకేష్, నారాయణస్వామి, కరీముల్లా, ఏఈలు మణి గోపాల్‌రెడ్డి, నిరూపమ, దిల్షాద్, స్వరూప, అబ్దుల్ రఫీ, విశ్వ కిరీటి, అంజనీ కుమార్, ఎంహెచ్ఓ ప్రశాంత్ వర్ధన్, అధికారులు పాల్గొన్నారు.

పెద్ద దర్గా గురువును సన్మానించిన సుభాన్‌బాషా

కడప కార్పొరేషన్, డిసెంబరు 12, ప్రభాతవార్త:

పెద్ద దర్గా ఊరేగింపులో భాగంగా గురువును వైసీపీ నాయకులు సుభాన్ బాషా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. గురువు ఆశీర్వాదములు తీసుకున్నారు.

అన్నమయ్య సహస్ర గళార్చనకు రామానుజన చిన్నజీయర్ స్వామి

రాయచోటి.డిసెంబర్ 12 ప్రభాతవార్త

రాయచోటి పట్టణం దశరథరామిరెడ్డి కళ్యాణమండపంలో మంగళవారం తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడం వీరాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగే అన్నమయ్య సహస్ర గళార్చన కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజన చిన్నజీయర్ స్వామి హాజరవుతున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వీరాంజనేయ ప్రసాద్ ఆహ్వానం మేరకు మంగళవారం మధ్యాహ్నం మూడు నుంచి 6 గంటల వరకు వీరాంజనేయ ప్రసాద్ ఇంట్లో బస చేయనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి అన్నమయ సహస్ర గళార్చన సంగీత కళా రత్న ఎర్రగోళ్ల శ్రీనివాసయాదవ్ సంగీత నిర్వహణలో పాల్గొననున్నారు. పూజా కార్యక్రమాలకు హాజరయిన భక్తులుకు వీరాం జేనేయ ప్రసాద్ అన్నదాన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రవచనాలు విని స్వామి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నందలూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త

మండలంలో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సృజన తెలిపారు. వర్షాలు అధికంగా కురుస్తున్న సమయంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. వర్షాలకు దోమలు విపరీతంగా పెరుగుతాయని, నివాసిత ప్రాంతాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిలిచిన కాలువల్లో కిరోసిన్, వేస్ట్ ఆయిల్, పియానిల్ వంటి పిచికారి చేయడం ద్వారా దోమల నశిస్తాయన్నారు. కాచి చల్లార్జిన నీరును తాగాలన్నారు. ఽబయట ఆహారం తీసుకోవడం మానివేయాలని పిల్లలకు సూచించారు.

హోటళ్లు రెస్టారెంట్‌లలో తనిఖీలు

ప్రభాతవార్తకు స్పందన

రాయచోటి.డిసెంబర్ 12 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డా.కె.షమీమ్ బాష సోమవారం హెటళ్లు రెస్టారెంట్‌లను తనిఖీ చేశారు. ఆదివారం వార్త దినపత్రికలో హోటళ్ల పర్యవేక్షణ కరువు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించి ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించి హోటళ్లు రెస్టారెంట్ల తనిఖీ చేసి వారు వాడుతున్న వంట సామాగ్రి వంట గదులు పరిశీలించారు. వినియోగదారులకు సక్రమైన నాణ్యమైన శుభ్రత కలిగిన ఆహారం అందించాలని యజమానులను ఆదేశించారు. దాదాపు 20 హోటళ్లలు రెస్టారెంట్‌లు తనిఖీ చేయగా వీటిలో 8 దుకాణాలు మాత్రమే చట్టం నిర్దేశించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫుడ్ లైసెన్స్ కలిగి ఉన్నాయని లేనివారికి నోటీసులు జరీ చేస్తామని డా.షమీమ్ బాష తెలిపారు. ఆహార పదార్థాలలో ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు ఉపయోగంచవద్దని వాడిన వంట నూనెను రెండు సార్లుకు మించి ఉపయోగించవద్దని హోటల్ యజమానులకు తెలియజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన కరోనా నిబందనలు తప్పకుండా పాటించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తెలియజేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు వై.రామయ్య, షంషీర ఖాన్ పాల్గొన్నారు.

మాండూస్ వల్ల మామిడికి నష్టం

పెనగలూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త

మాండూస్ తుఫాను వల్ల మండలం లో ఎక్కువశాతం మామిడి రైతులే నష్టపోయారు. 3 రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో మామిడి పూతదశకు వస్తున్న సందర్భంలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 2, 3 మార్లు పూత వచ్చే దశల్లో మొదటిసారి ఎక్కువ శాతం పూత నిలబడి రాబడి వచ్చి రైతులు ఎక్కువ లాభా లు ఆర్జించేవారు. 2, 3 దశల్లో స్వల్ప పూత వచ్చినప్పటికి మొదటిసారి నిలబడిన పూతే అధిక దిగుబడిని ఇస్తుంది. తుఫానుతో పూత పూర్తిగా దెబ్బతిని నల్లగా మారి రాలిపోతుందని మామిడి రైతులు వాపోతున్నారు. మండలంలో చెయ్యేరునది 75 శాతం సాగగా గుంజనేరు అధికంగా ప్రవహించింది.ఓబిలి పంచాయతిలో జడవారిపల్లెకు వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మోరి వద్ద కుప్పకూలి కుంగిపోయింది. తద్వారా ఓదేటివారిపల్లె నుండి ఓబిలి పంచాయతికి రాకపోకలు నిలిచిపోయి తద్వారా విద్యార్థులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపడితేగాని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు తప్పవని గ్రామస్థులు, విద్యార్థులు వాపోతున్నారు.

దెబ్బతిన్న వరి పంట పరిశీలన

నందలూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని చాలా గ్రామాల్లో మాండూస్ తుఫాను వల్ల వరిపంట మునిగిపోయి రైతులు నష్టపోయారని వ్యవసాయ సహాయకురాలు పి.పుష్పాంజలి అన్నారు. నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతిలోని సచివాలయ-2 పరిధిలో నీటమునిగిన వరిపంటను ఆమె పరిశీలించారు. రైతులకు దెబ్బతిన్న వరిపంటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలిచ్చినట్లు ఆమె తెలిపారు. అన్ని గ్రామాలు సందర్శించి రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఆమె తెలియజేశారు.

నేడు పాస్‌పోర్టు ఇబ్బందులపై సమీక్ష

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలోని స్థానిక పోస్టాఫీసు పక్కనే ఉన్న పాస్‌పోర్టు దరఖాస్తు కార్యాలయంలో వద్ద మంగళ వారం బిజెపి సీనియర్ నాయకులు సాయిలోకేష్ ఆధ్వర్యంలో పాస్‌పోర్టు ఇబ్బందులపై ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సాయిలోకేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన రాజంపేట పార్లమెంటరి ఉపాధ్యక్షుడు వాకచర్ల సుబ్బారావు నివాసంలో ప్రత్యేక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ ప్రాంతాల్లో నియోజకవర్గంలో ఉన్నవారు వారి సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేగవంతంగా పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి పార్లమెంటరి ఉపాధ్యక్షుడు వాకచర్ల సుబ్బారావు, కిసాన్ మోర్చ నాయకులు తోట శ్రీనివాసులు, బాలసుబ్ర మణ్యం, బత్తల సుబ్రమణ్యం, గౌరికుమార్, జోగినేని సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హామీతో తాత్కాలికంగా నిరాహార దీక్షలు విరమణ

రాయచోటి రూరల్, డిసెంబర్ 12ప్రభాతవార్త:

అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే అంబేద్కర్ విగ్రహాన్ని జనవరి మొదటి వారంలోపు పెట్టడానికి రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తమకు హామీ ఇవ్వడంతో తాత్కాలికంగా నిరాహార దీక్షలను సోమవారం తాత్కాలికంగా వాయిదా వేసుకున్నట్లు ప్రజా సంఘాల జెఏసి నాయకులు విలేకరులకు తెలిపారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

పోరుమామిళ్ళ రూరల్, డిసెంబర్ 12ప్రభాతవార్త:

మండూస్ తుఫాన్ దాటికి గురై, చేతికి వచ్చిన పంటలు నాశనమై తీవ్ర ఆవేదన చెందుతున్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండూస్ తుఫాన్ ప్రభావితం వలన నెల్లూరు, రాయలసీమ ప్రాంతాలలో అనేక మండలాలలో వేల ఎకరాలలో మిర్చి, అరటి, పత్తి, వరి లాంటి 30 రకాల పంటలు నీట మునిగి, కొన్ని చేతికి వచ్చిన పంటలు నాశనమైన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. నష్టం వాటిల్లిన బాధితులకు ప్రకటించిన 2 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని, గరిష్టంగా 5 వేల రూపాయలకు పెంచాలని

గిట్టుబాటు ధర కల్పించడంలో వైకాపా ప్రభుత్వం విఫలం

వేంపల్లె, డిసెంబరు 12, ప్రభాతవార్త :



వినతిపత్రం ఇస్తున్న తెదేపా నాయకులు

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో వైకాపా ప్రభుత్వం విఫలం చెందిందని టీడీపీ మండల కన్వీనరు రామమునిరెడ్డి, పులివెందుల రైతు విభాగం అధ్యక్షుడు నాగభూషణంరెడ్డిలు పేర్కొన్నారు. రైతులను ఆదుకోవాలని కోరుతూ టీడీపీ ఆధ్వర్యంలో వేంపల్లెలో మౌన దీక్ష చేపట్టారు. అనంతరం మండల కన్వీనరు రామమునిరెడ్డి, పులివెందుల రైతు విభాగం అధ్యక్షుడు నాగభూషణంరెడ్డిల ఆధ్వర్యంలో మండల కన్వీనరు రవీంద్ర నాథరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు లేకపోవడంతో రాష్ట్రంలో రోజురోఉకు రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నట్లు చెప్పారు. కల్తీ ఎరువులు, విత్తనాల వల్ల రైతులు చాలా మోసపోతున్నట్లు చెప్పారు. మాండూస్ తుపాను కారణంగా రైతులు సాగుచేసి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని కోరారు. రసాయన ఎరువుల ధలను నియంత్రించాలని చెప్పారు. వర్షానికి వరిధాన్యం మొలకెత్తడం జరిగిందని కాబట్టి మొలకెత్తిన వరిధాన్యాన్ని రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పులివెందుల రైతు విభాగం అధ్యక్షుడు నాగభూషణంరెడ్డి, రాఘవరెడ్డి, మైసూరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గణేష్‌నాయక్, తుపాకుల గంగిరెడ్డి, మల్లికార్జున, చెంద్రాయుడు, మహమ్మద్, తెలంగాణ వలి, వీరభద్ర, గోగుల మల్లికార్జున, డక్కా రమేష్, జయరామిరెడ్డి, పాపిరెడ్డితో పాటు పలువురు రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

14 న ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం

కేవి.పల్లె, డిసెంబరు 12 ప్రభాతవార్తః

మండలంలోని సొరకాయలపేట పంచాయతీ మిన ్నంరెడ్డిగారిపల్లెఉన్నత పాఠశాల ప్రాంగణం నందు 14వ తేదీ బుధవారం చెన్నై శంకర నేత్రాలయం కంటి వైద్యశాల వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేస్తున్నటు ్ల నిర్వాహకులు వంగిమళ్ల నరసారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిలు తెలిపా రు. ఈశిబిరం ఈపనెల 21వ తేదీ వరకు కొనసాగుతుందని ఆపరేష

ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ వినతి

మదనపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

కోట్లాది రుపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని అసోసియేషన్ పేరుతో కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, ఈ భూమిని కాపాడాలంటూ వలసపల్లె గ్రామస్థులు విన్నవించారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ వలసపల్లె గ్రామంలోని సర్వేనెంబర్ 711/1లో 4.13ఎకరాల ప్రభుత్వభూమిని పట్టణానికి చెందిన కొందరు డ్రైవర్ల అసోసియేషన్ పేరుతో కబ్జాకు యత్నిస్తున్నారన్నారు. ఈ స్థలం ముందర నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం పాఠశాలలు ఉన్నాయన్నారు. అసోసియేషన్ వారికి ఈ స్థలం కేటాయిస్తే కేంద్ర విద్యా సంస్థలుగా ఉన్న వీటికి కూడా ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఎంతో విలువైన ఈ భూమిని ప్రభుత్వ కార్యాలయాలు కాని, ప్రజా అవసరాలకు ఉపయోగపడే భవనాలకు కాని వినియోగించాలని కోరారు. ఇప్పటికే స్పందనలో ఈ స్థలం గురించి కలెక్టర్ పిఎస్.గిరీషా, ఆర్డీఓ ఎంఎస్.మురళి, తహశీల్దార్ సికె.శ్రీనివాసులకు విన్నవించడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వైకాపా సీనియర్ నాయకులు నాగరాజరెడ్డి, ఎంపిటిసి మునిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, కె.రవి, క్రిష్ణమూర్తి, మహేష్, చంద్రా పాల్గొన్నారు.

వర్షంతో వెలవెలబోయిన స్పందన

మదనపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

ఎడతెరపులోని వర్షం పడుతుండడం వల్ల సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన స్పందన అర్జీదారులు లేక వెలవెలబోయింది. సాధారణ రోజుల్లో జరిగే స్పందనా కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఆర్డీఓ ఎంఎస్.మురళికి పెద్దఎత్తున అర్జీలు ఇచ్చేవారు. అలాంటిది మాండూస్ తుఫాన్ కారణంగా నిరవధికంగా వర్షం పడుతుండడం వల్ల ప్రజలు ఎవరూ స్పందనా కార్యక్రమానికి పెద్దగా హాజరు కాలేక పోయారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్పందనా కార్యక్రమానికి కూడా కేవలం ఇద్దరు అర్జీదారులు మాత్రమే సమస్యలపై విన్నవించారు.

కార్మికులకు రెయిన్‌కోట్స్, గ్లౌజులు ఇవ్వాలి

కమీషనర్‌కు నాయకులు వినతి

మదనపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులకు తుఫాన్ కారణంగా రెయిన్‌కోట్స్, గ్లౌజులు ఇవ్వాలని సోమవారం యూనియన్ నాయకులు మున్సిపల్ కమీషనర్ ప్రమీలకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల ఆరోగ్యాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారన్నారు. తుఫాన్ కారణంగా కార్మికులకు దగ్గు, జలుబు, జ్వరం బారిన పడి అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. వెంటనే కార్మికులకు షెఫ్టి కిట్స్ ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తున్న కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వర్కర్స్ అధ్యక్ష, కార్యదర్శులు వర్రి సురేష్‌కుమార్, నాగరాజులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కలికిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

గ్రామాల్లో ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మేడికుర్తి సర్పంచ్ నాగేవేణి, కార్యదర్శి రమేష్‌బాబు గ్రామస్థులకు సూచించారు. సోమవారం పంచాయితీల్లోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రైనేజి కాలువలను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేశారు. అనంతరం శానిటేషన్‌పై ప్రజలకు కార్యదర్శి రమేష్‌బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది,గ్రామస్థులు పాల్గొన్నారు.

14న మండల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కలికిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల 14న 2023-24 సంవత్సరం గ్రామ పంచాయతీలకు మండల అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్, ఎంపిటిసి, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఓ గంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

పాఠశాలలో కంప్యూటర్ చోరీ

మదనపల్లెక్రైం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

మదనపల్లె రూరల్ మండలంలోని కొత్తవారిపల్లె పాఠశాలలో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పాఠశాలకు సెలువుదినం కావడంతో తలుపులు పగలుకొట్టి లోనికి ప్రవేశించారు. పాఠశాలోని విలువైన కంప్యూటర్లు, మానిటర్లను అపహరించారు. సోమవారం ఉదయం స్కూలుకు వెళ్ళిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు చోరీ అయిన విషయాన్ని గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టిడిపి సీనియర్ నాయకులు మృతి

రామసముద్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని కాపల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామక్రిష్ణారెడ్డి ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సోమవారం మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని కోరినట్లు ఆయన తెలిపారు. అనంతరం మృతుని కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఆయనతో పాటు మండల అధ్యక్షులు విజయకుమార్‌గౌడు, మాజీ సర్పంచ్ రమణ, శీతప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివద్ధికి కలిసి పని చేద్దాం

వాల్మీకిపురం, డిసెంబరు 12 ప్రభాతవార్తః

మండలంలోని అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పంచాయతీల అభివద్ధికి కలిసి పనిచేద్దామని ఎంపీడీఓ షబ్బీర అహ్మద్‌అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీ అభివద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల స్థాయి పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ సచివా లయ సిబ్బంది హాజరయ్యారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక చక్కగా అమలు చేస్తే సమస్యలు లేని గ్రామాలు నిర్మితమవు తాయన్నారు. మెరుగైన జీవనోపాదులు, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, నీటి సమద్ధి, పరిశుభ్రం పచ్చదనం, మౌళిక వసతుల కల్పన, నిబంధనలకు అనుగుణంగా సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చునని సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ములకలచెరువు, డిసెంబరు12, ప్రభాతవార్త:

మండలంలోని వీఆర్వోలు, అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలతో తహసీల్దారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాండూస్ తుఫాన్ ప్రభావంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

కురబలకోటలో రూ.2కోట్లు పంట నష్టం

కురబలకోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

కురబలకోట మండలంలో మాండూస్ తుఫాన్‌కు రూ.2కోట్లు నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా కురుస్తున్న ఈ వర్షానికి చేతికొచ్చే పంటలు దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. దీంతో రైతులు దెబ్బతిన్న పంటలను చూసి దిగాలు చెందారు. మరోపక్క ఈ వర్షానికి జనజీవనం అస్థవ్యస్తం గా మారింది. మండలంలో జబ్బావారిపల్లెకు చెందిన రామరెడ్డి సాగుచేసిన ఎకరా ముగనపంట నేలకొరిగింది. దీంతో రూ.5లక్షల మేరకు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. కనసాని వారిపల్లె గ్రామంలో బంగాళదుంప, ముదివేడు, పిచ్చల వాండ్ల పల్లెల్లో క్యాబేజి, వంగపంటలు దెబ్బతిన్నాయి. వరిపంట నేలవాల డంతో తిరిగి మొలకెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. టమోటా పంటల్లో నీరు నిలిచిపోవడం, టమోటా చెట్లు నేలకొరడంతో దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. కడపక్రాస్ గ్రామం బోడిమీదపల్లెకు చెందిన రైతు ఉడిపి నడిపన్నకు చెందిన గొర్రెలు, 8 పొటేళ్ళు ఈ వర్షానికి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వారు రూ.2లక్షల మేరకు బాధిత రైతులు నష్టం వాటిళ్ళనట్లు తెలిపారు. మండలంలో 150ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిసింది. మండలంలో ఈ వర్షానికి దెబ్బతిన్న ఆస్థి, పంటనష్టపరిహారాన్ని పక్కాగా నివేదికలు అందజేయాలని తహశీల్దార్ భీమేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఆర్‌సి కుర్వపల్లె వద్ద రెండు విద్యుత్ స్థంబాలు దెబ్బతినగా ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ వెంకటరత్నం తెలిపారు. ట్రాన్స్‌కోలు రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు.

మిట్స్‌కు జాతీయ అక్రిడేషన్

కురబలకోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

మదనపల్లెకు సమీపాన అంగళ్ళు వద్ద ఉన్న మిట్స్ కళాశాలకు జాతీయ అత్యుత్తమ అక్రిడేషన్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఎంసిఏ, ఎంబిఏ విభాగాలకు జాతీయ అత్యుత్తమ అక్రిడేషన్ సంస్థ అయిన నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడేషన్ లభించినట్లు ఆయన తెలిపారు. కళాశాలలోని నాణ్యత, విద్యాప్రమాణాలలో పర్యవేక్షించి ఈ అక్రిడేషన్లు ఇస్తారని ఆయన తెలిపారు. ఈ అక్రిడేషన్ సాధించడానికి సహకరించిన తమ కళాశాల పార్ట్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ కమాల్‌బాషా, విభాగాదిపతులు, అధ్యాపకులు విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ ఎన్.విజయ బాస్కర్‌చౌదరి, ఈడి కీర్తి నాదేళ్ళ, ప్రిన్సిపాల్ అభినందనలు తెలియ జేశారు.

సుప్రీం కోర్టు సంచలన నిర్ణయం

కడప వైద్య విభాగం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

ఇటీవల రహదారులపై జరుగుతున్న అనేక ప్రమాదాలపై భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) సంచలన నిర్ణయం తీసుకుంది. రహదారులు, జాతీయ రహదారులపై వంతెనలపై ఎలాంటి ధాన్యం ఆరబోసినా సంబంధిత రైతుపై కేసు నమోదు చేయడంతో పాటు రూ. 10వేలు జరిమానా విధించడం జరుగుతుంది. సంబంధిత శాఖ ఈ జరిమానా విధిస్తుంది. ఈ నేపథ్యంలో ఈ ఆరబోసిన ధాన్యం వల్ల రోడ్డు ప్రమాదంలో వాహనదారులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యమైనా, వాహనానికి సంబం ధించిన బీమా డబ్బులు బాధిత వ్యక్తులకు అందజేయబడవు. ప్రమాదానికి కారకులైన ధాన్యం ఆరబోసిన రైతు నుంచి రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు ఆస్తి జప్తు చేసి బాధిత ప్రమాద వ్యక్తులకు అందజేస్తారు. అన్నదాతలు ఇలాంటి ఇబ్బందులు కలిగే సంఘటనలకు కారణమైనా, రహదారులు, జాతీయ రహదారులపై ధాన్యం ఆరబోయకుండా జాగ్రత్తగా ఉండాలని భారత అత్యున్నత ధర్మాసనం అన్నదాతలకు సూచించింది. సంబంధిత శాఖాధికారులకు ఈ సంఘట నలు తీవ్రమైన పరిణామాలని, వీటిపై దృష్టి పెట్టక పోవడం శోచనీయమని అధికారులను మందలించింది.

పోలీస్‌స్టేషన్‌లో వాహనాలకు వేలంపాటలు

మదనపల్లెక్రైం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

మదనపల్లె రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో వివిద ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు డిఎస్‌పి కేశప్ప ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. రెండవ పట్టణ సిఐ మురళీక్రిష్ణ, ఎస్‌ఐ చంద్రమోహన్ ఈ వేలంలో పాల్గొన్నారు. ద్విచక్రవాహనాలు మూడు, ఒక ఆటోతో కలపి నాలుగు వాహనాలకు ఈ వేలం పాటు నిర్వహించినట్లు తెలిపారు. ఆటో స్క్రాప్ రూ.7300, యమహా రూ.26 వేలు, పల్సర్ రూ.30వేలు, పైప్ రూ.85వేలు మొత్తం రూ.1,48, 800లు జిఎస్‌టి 18శాతంతో కలపి ప్రభుత్వ ఖజానాకు చెల్లించినట్లు డిఎస్‌పి తెలిపారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం : ఎమ్మెల్యే

మదనపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

రాష్ట్రంలో భూతగాదాలు, భూ సంబంధ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించే లక్ష్యంతో సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ జగనన్న భూ హక్కు భూరక్ష పేరుతో సమగ్ర భూ సర్వే కు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. స్పష్టమైన భూ రికార్డులు ఏర్పరచడం ద్వారా భూముల అసలు యజమానులకు వాటిపై పూర్తిస్థాయి హక్కులు కల్పించి బవిష్యత్తులో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా రక్షణ కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రామసముద్రం, మదనపల్లె మండలాలకు చెందిన 48మంది రైతులకు భూ హక్కుల పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎంఎస్. మురళి, ఎంపిపి వెలుగు రెడ్డెమ్మ, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ జింకా చలపతి, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ క్రిష్ణారెడ్డి, జడ్పిటిసి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కనకదాస్ జయంతి వేడుకలకు కర్నాటక మాజీ మంత్రికి ఆహ్వానం

మదనపల్లె, డిసెంబర్ 12 ప్రభాతవార్త :

ఈనెల 27న నిర్వహించనున్న 535 వ కనకదాస్ జయంతి వేడుకలు, కురబ సంఘం 7వ వార్షికోత్సవం, షెఫెర్డు ఇండియా ఇంటర్‌నేషనల్ 7వ వార్షి కోత్సవానికి కర్నాటక మాజీ మంత్రి హెచ్ఎం. రేవణను ఆహ్వానించినట్లు కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. బెంగుళూరులోని మంత్రి స్వగృహానికి వెళ్ళి ఆహ్వానం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈయనతో పాటు కర్నాటక షెపెర్డ్ ఇండియా ఇంటర్‌నేషనల్ సభ్యులు హరీష్, నాగరాజు, జిద్ద మేని, ఐటిఐ నాగరాజు పాల్గొన్నారు.

నేడు కారు వేలం

పీలేరు, డిసెంబరు 12 ప్రభాతవార్తః

సారా అక్రమ రవాణా కేసులో పట్టుబడిన కారును మంగళవారం వేలం నిర్వహించనున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో సీఐ వై.గురు ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఉదయం 10గంటలకు టాటా ఇండికా కారు వేలం నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొన వచ్చునని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వీడండి : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు డిసెంబర్ 12, ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు అలసత్వం వీడాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో సోమవారం ఆయన కొత్తపల్లి గ్రామపంచాయతీ సచివాలయ ఉద్యోగులకు సిబ్బందికి, ఎంపీడీవో, వార్డు సభ్యులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి పంచాయతీ పరిధిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు ప్రజా సమస్యల పరిష్కా రంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే రాచమల్లు హెచ్చరించారు. కొత్తపల్లి గ్రామపంచాయతీలో మౌలిక సదుపాయాల నిమిత్తము ఏ ఏ పనులకు ఎంత అవసరం అవుతాయో నివేదికలు తయారు చేయాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కడైనా రోడ్లు మురికి కాలువలు త్రాగునీరు వీధిలైట్లు సంబంధించిన ఏ సమస్యలు ఉన్నా నా సొంత నిధులైన ఉపయోగించి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కొత్తపల్లి పంచాయతీకి ఏడాదికి నాలుగు కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అందులో కోటి రూపాయలు సిబ్బందికి జీతాల రూపంలో ఖర్చు అవుతుందని కార్యదర్శి నరసింహులు ఎమ్మెల్యేకు వివరించారు కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్ సచివాలయ సిబ్బంది ఎంపిటిసిలు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గంజాయి డ్రగ్స్ మాఫియాని అరికట్టాలి

ప్రొద్దుటూరు డిసెంబర్ 12, ప్రభాతవార్త

ఏపీలో గంజాయి డ్రగ్స్ మాఫియాని అరికట్టాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఏపీ దొరుకుతున్న గంజాయి డ్రగ్స్ మాఫియాని అరికట్టాలని, ఈ గంజాయి ఎక్కడి నుంచి సరఫరా అవుతుందో తెలుసుకోవాలని, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపి యువత గంజాయి డ్రగ్స్‌కు బానిసలు కాకుండా కాపాడాలని కోరారు. అనంతరం స్థానిక మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సాధికారక కమిటీ స్టేట్ కన్వీనర్ మధుబాబు, ప్రొద్దుటూరు మండల ఉపాధ్యక్షుడు షరీఫ్,తెలుగు యువత నాయకులు ఆంజనేయులు, పల్లా సాయిరాం. మధు, సుభాన్, ప్రసాద్, శేషారెడ్డి, మాబు స్థానిక తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

తుఫానువల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి : సిపిఐ

ప్రొద్దుటూరు డిసెంబర్ 12, ప్రభాతవార్త

జిల్లాలో మాండస్ తుఫాను వలన రైతులకు చేతికి అందివచ్చిన పంటలు దెబ్బ తిన్నాయని, తక్షణమే రైతులకు నష్టపరిహార చర్యలు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాండస్ తుఫాను విపత్తు కు తక్షణమే సహాయ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు అధికారులతో వేగవంతంగా సర్వేలు నిర్వహించాలని సిపిఐ పట్టణ సమితి తరపున కోరారు. అలాగే రహదారులు సైతం దెబ్బ తిన్నాయని, నాసిరకం రహదారులు వేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పాడైన రహదారులు బాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, సిపిఐ పట్టణ సభ్యులు మద్దిలేటి, సుబ్బరాయుడు, ప్రమీల, సుజాత పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభకు ప్రతినిధిగా సగిలి రాజేంద్ర ప్రసాద్ ఎన్నిక

కడప వైద్య విభాగం, డిసెంబరు 12, ప్రభాతవార్త:

హైదరాబాదులో ఈనెల 13 నుంచి 16 వరకు జరగనున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) అఖిల భారత మహాసభకు కడప జిల్లా నుంచి ప్రతి నిధిగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ అఖిల భారత మహాసభలు 3 సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయని, ఇప్పుడు 17వ అఖిల భారత మహాసభ హైదరాబాదులో నిర్వహించనున్నా రని ఈ మహాసభకు కడప జిల్లా నుంచి ప్రతినిధిగా అవకాశం రావడం సంతోషించదగ్గ విషయమన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి - వైస్ ఎంపిపి, సర్పంచ్

గాలివీడు.డిసెంబర్ 12 ప్రభాతవార్త

విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వైస్‌ఎంపిపి మిట్టపల్లి యధుబూషణ్‌రెడ్డి, గాలివీడు సర ప్రంచ్ లక్ష్మీదేవమ్మలు పేర్కొనా న్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలురు ఉన్నత పాఠశాల ఆవ రణంలో ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డెన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫేర్ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మారుతున్న కాలానుగుణంగా శాస్త్రీయ దృక్పదం కలిగిఉండాలన్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి వనరులతో సొంతపరి జ్ఞానాన్ని జోడించి కొత్త ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రదానోపాధ్యాయులు రెడ్డెన్న ప్రసంగిస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి శాస్త్రీయ విజ్ఞానం వైపు అడుగులు వేయడానికి సైన్స్ ఫేర్ ఎంతగానో ఉప కరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠ శాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల,

తుఫానుతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి : సీపీఐ

జమ్మలమడుగు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

మాండూస్ తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక జమ్మల మడుగు తహసీల్దార్ రవీంద్రారెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో రైతాంగం పూర్తిగా నష్టపోయిందని నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. వరి కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని కొన్నేళ్లుగా నోటికందుతుందన్న హైబ్రీడ్ సజ్జ నారు నాటకుండానే ముదిరిపోయిందని వారు తెలిపారు. తక్షణమే ప్రతి ఎకరాకు రూ.15వేలు నష్టపరిహారం ప్రభుత్వం వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, విజయ్, ఓబులేసు, దస్తగిరి పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

దువ్వూరు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఖాదర్‌వల్లీ సోమవారం పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని లెప్రసీ సర్వే, రికార్డులను, టీబీ వ్యాధిగ్రస్థుల వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కాంటెస్ట్ గురించి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబరు 15 నుంచి డిసెంబరు 5 వరకు జరిగిన లెప్రసీ సర్వేలో 88 అనుమానిత కేసులు గుర్తించి అందులో వైద్య పరీక్షల అనంతరం 33 మందికి రోగ నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. మిగతా వారికి కూడా వైద్య పరీక్షలు పూర్తి చేయాలన్నారు. మండలంలోని టీబీ వ్యాధిగస్థులు 28 మంది ఉన్నారని వారికి సకాలంలో మందులు ఇచ్చి ఆరోగ్యవంతులుగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.సురేష్‌బాబు, వైద్యసిబ్బంది శివరామయ్య, మురళీధర్, మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగులో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులు

కడప ఏడురోడ్లు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

కడప నగరంలోని మరియాపురానికి చెందిన పీస్ ఇస్లామిక్ హైస్కూల్ విద్యార్థులు తెలుగులో అద్భుత ప్రతిభ చూపించి అందరినీ అబ్బుర పరిచారు. స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించిన బ్రౌన్ గ్రంథాలయ వారోత్సవాలలో పాల్గొ ని బహుమతులు గెలుచుకోవడంతో పాటు అందరి మన్ననలు పొందారు. వక్తృత్వం పోటీల్లో ప్రోత్సాహక బహుమతి గెలిచిన సయ్యద్ ముషాహిదా 9వ తరగతి చదువుతోంది. ప్రోత్సాహక బహుమతి పొందిన షేక్ సారా అంజామ్ 9వ తరగతి. క్విజ్ పోటీల్లో తృతీయ బహుమతి గెలిచిన సయ్యద్ అలియా(9వ తరగతి), చిత్రలేఖనంలో తృతీయ బహుమతి సయ్యద్ ముస్లిహా(5వ తరగతి), పద్య పఠనంలో ప్రోత్సాహక బహుమతిని ఆసీఫా (7వ తరగతి), ఫౌజియా (8వ తరగతి) గెలిచారు.

పెద్ద దర్గాను దర్శించుకోవడం అదృష్టం

కడప ఏడురోడ్లు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

దర్గా ఉరుసు ఉత్సవాలలో దర్గాను దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్రపతి అవార్డు గ్రహీత గానుగపెంట హనుమంతరావు అన్నారు. మనసు ఎంతో ప్రశాంతత ఏర్పడిందన్నారు. ముందుగా ఆయన దర్గా పీఠాధి పతి

పంట పొలాల పరిశీలన

– వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య

బద్వేలు రూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త :

బద్వేలు మండల పరిధిలోని పలు గ్రామాలలో పంట పొలాలను వ్యవసాయ విస్తర ణ అధికారి ఓబయ్య పరిశీలిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాను కార ణంగా నిరంతరాయంగా వర్షా లు పడుతుండడంతో కొండు గారిపల్లె గ్రామంలో ప్రొద్దుతిరుగుడు పంట నీట నీటి మునిగి రైతుకు ఇబ్బంది కలిగించిందని, ఇలాగే వర్షాలు పడితే పంట చేతికి రాదని, గ్రామాలలో దాదాపు 40 ఎకరాలలో వరి పంట నీట మునిగి రైతులు పంట నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారని, రైతులు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన క ల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆసరా కోల్పోయిన వృద్ధులకు చేయూత

బద్వేలు అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త :

బద్వేలు ప్రాంతంలో వివి ధ గ్రామాలలో ఆదరణ కోల్పో యిన అనాథ వృద్ధులను అ క్కున చేర్చుకొని వారి బాగోగు లు చూసుకుంటున్న ఆనంద నిలయం అనాథాశ్రమ నిర్వా హకులు పిడతల రవి కుమార్ ను అట్లూరు మండలం చౌటపల్లెకు చెందిన మెంటా వెంకట కృష్ణ అభినందిం చారు. సోమవారం మెంటా వెంకట కృష్ణ, సతీమణి భవాని కుమార్తె యశస్విని జన్మ దినోత్సవం పురస్కరించుకొని ఆశ్రమంలో ఉండే అనాథ వృద్ధులకు భోజ నం, స్వీట్లు, తినుబండారాలను అందజేయడంతో పాటు ఓ అనాథ వృద్ధుడు ఆదరణ కోల్పోయి అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారి వైద్య పరీక్షలకు కొం త నగదును వారి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం మెంటా వెంకట కృష్ణ మాట్లాడుతూ ఆసరా కోల్పోయిన అనాథ వృద్ధులకు ప్రతి ఒక్కరూ ముందు కొచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందజేయాలన్నారు. తమ కుమార్తె జన్మ దినోత్సవాన్ని అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవడం తమకు ఎంతో ఆనంద దాయకంగా ఉందని, వృద్ధాశ్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని, అనంతరం వృద్ధుల బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు.

రైతులకు మాండూస్ తుఫాను సహాయం త్వరగా అందేలా చూడాలి

కలెక్టర్‌ను కలిసిన మేడా

రాజంపేట అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త

రాజంపేట నియోజకవర్గ పరిధిలో జరిగిన పంటనష్టంపై వివరాలు సేకరించి రైతులకు త్వ రగా పరిహారం అందేలా చూడా లని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కడప కలెక్టర్ విజయరామరాజును కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిశారు. వెంట రైతులను కూడ తీసుకెళ్లారు. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో ఎడతెర పిలేని వర్షాలతో రైతులు పంటలు కోల్పోయారని పేర్కొన్నారు. రైతుల వివరాలు త్వరగా సేకరించి ప్రభుత్వానికి పంపి విపత్తు నిధులతో ఆదుకోవాలని కోరారు. రైతులకు న్యాయం చేస్తామని కలెక్టర్ విజయరామరాజు ఎమ్మెల్యేకు హామి ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఒంటిమిట్ట ఎంపిపి జనార్దన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సుబ్బారెడ్డి, యానాదిరెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి, విఆర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

టిడిపి సీనియర్ నేత జగన్‌మోహన్‌రాజు

రాజంపేట అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త

మాండూస్ తుఫాను ప్రభావంతో పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ ఎడతెరపిలేని వర్షాలతో ఒంటిమిట్ట, సిద్ధవటం, రాజంపేట మండలాల్లో పంటనష్టం జరిగిందన్నారు. ప్రధానంగా అరటి, బొప్పా య పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జిల్లా యం త్రాంగం దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో సర్వేచేసి త్వరగా పంపాలని కోరారు. వరిపంట ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల్లో నీటమునిగిందన్నారు. రైతుల సంక్షేమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. రైతుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతులకు త్వరగా పంటనష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో కూడ రైతులకు జరిగిన పంటనష్టాన్ని భర్తీ చేయలేదని గుర్తు చేశారు.

ఎర్ర చందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

–జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి.డిసెంబర్ 12 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలోని రా జంపేట, రాయచోటి సబ్ డివిజ న్‌లలోని రైల్వేకోడూరు, కేవి పల్లి పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఎర్ర చందన అక్రమ రవాణాపై పోలీస్‌లు విస్తృత దాడులు నిర్వ హించారు. వాహనాల తనిఖీలో భారీగా ఎర్ర చందన దుంగలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల వ్యవధిలో ఐదుగురు స్మగ్లర్‌ల అరెస్ట్, 26 ఎర్ర చందన దుంగలు, స్కార్‌పియో వాహనం, పల్సర్‌బైక్, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎర్ర చందన అక్రమరవాణాకు సంబంధించిన సమాచా రాన్ని డయల్ 100 కు తెలియజేయాలని ప్రజలకు జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయన్నారు.

జగనన్న కాలనిల్లో మెరుగైన వసతులను కల్పించండి

ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు రూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో మెరు గైన వసతులను ఏర్పాటు చేయాలని సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర గిరీషాను కోరినట్లు రైల్వేకోడూరు శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు తెలిపా రు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన ప్రత్యే కంగా మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలో నూతనంగా అత్యంత వేగ వంతంగా తయారవుతున్న జగనన్న కాలనిల్లో మెరుగైన వసతులను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యంత ప్రతిష్టా త్మకంగా చేపట్టిన నిరుపేదలకు గూడు కల ్పించేవిధంగా జగనన్న కాలనిలను ఏర్పాటు చేయడం జరుగుతున్నదని, ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మౌళిక వసతులు ఏర్పాటు చేసి సహకరించాలని ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజనేరు

రైల్వేకోడూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలో గత 3 రోజులుగా ఏకదాటిగా కురుస్తున్న భారీ వర్షానికి గుంజనేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ముఖ్యంగా శేషాచల అడవుల్లో కురిసిన భారీ వర్షానికి గుంజనేటికి వర్షపునీరు రావడంతో గుంజనేరు ఉధృతంగా ప్రవహిస్తున్నది. అధికారుల అప్రమత్తతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సేవలకు పురస్కారం

రూపాయకే వైద్య సేవలందించిన డా॥ విష్ణువర్ధన్ రెడ్డికి సత్కారం

బద్వేలు అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త :

కరోనా మహమ్మారి సమ యంలో బద్వేలు ప్రాంత ప్రజలకు గత రెండు పర్యాయాలుగా ఎంతో వైద్య సేవలందించి బద్వేలు, అ ట్లూరు మండలాలోని గ్రామాలలో అనేక చోట్ల పేద ప్రజలను దృష్టి లో పెట్టుకొని అవసరమైన మెడిక ల్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి ఉచి తంగా మందులు అందజేసిన నిర్వాణ హాస్పిటల్ డా॥ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డి తగిన గుర్తింపు పొందడం ఎంతో అభినందనీయం అని పలువురు వారి సేవలను ప్రశంసిస్తున్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని కడప నగరంలోని కెఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో మానవ హక్కుల అవగాహన సంఘం జాతీయ ఛైర్మెన్ కాసల కోనయ్య ఆధ్వర్యంలో నిర్వాణ హాస్పిటల్ డా॥ విష్ణువర్ధన్ రెడ్డికి సర్వ శిక్ష పథక అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ ఈడి డా॥ వెంకటసు బ్బయ్య, రిటైర్డ్ డిఎస్పీ సుకుమార్ ల చేతుల మీదుగా మెమెంటో అంతజేసి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం కాసల కోనయ్య మాట్లాడుతూ బద్వేలు ప్రాంతంలో కరోనా మహమ్మారి సమయంలో డా॥ ముడ మాల విష్ణువర్ధన్ రెడ్డి నిరంతరాయంగా కోవిడ్ పేషెంట్లకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి కోవిడ్ మహమ్మారికి గురికాకుండా భయాందోళనకు గురికా కుండా అవగాహన కల్పిస్తూ పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని రూపాయకే కొంత కాలం వైద్య సేవలందిస్తూ, గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య సేవలందించిన డా॥ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.

భూ హక్కు పత్రాలు త్వరితగతిన పంపిణీ చేయాలి

–మ్యుటేషన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టిసారించండి

–జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి.డిసెంబర్ 12 ప్రభాతవార్త

మాండూస్ తుఫాన్ బాధితులకు ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన ఎన్యుమరేషన్ అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ సంబందిత అధికారుల ను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాండూస్ తుఫాన్, ఎలక్షన్స్, రీసర్వే, తదితర అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దా ర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఇళ్లు ముంపునకు గురైన కుటుంబాలకు, పశువులకు నష్టం జరిగిన వారికి త్వరితగతిన నష్టపరిహారం అందజేయలన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ కార్డు అనుసందానంకు సంబందించి 6బి ఫామ్ పెండింగ్ లేకుండా క్లియర్ చేయాలన్నా రు. ఓటర్లు జాబితాను పారదర్శకంగా చేపట్టి మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించి ఒకే ఇంటి నంబర్ కలిగిన కుటుంబ సభ్యుల పేర్లు ఒక చోట ఉండేటట్లు చూడాలన్నారు. జిల్లాలో తప్పులు లేని ఓటర్లు జాబితా రూప కల్ప నకు సంబందితి అధికారులు కృషి చేయాలన్నారు. రీ సర్వే పూర్తయిన గ్రా మాలలో ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలతో మాట్లాడి బుదవారం లోపల భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాలన్నారు. మ్యుటేషన్ బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మల్టిపర్పస్ ఫెసిలిటి సెంటర్‌లకు స్థల సమస్య పరిష్కరించాలని ఆర్డీవోలు తహశీల్దార్‌లకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌వో సత్యనరాయణ, భూములు సర్వే విభాగం సహాయ సం చాలకులు జయరాజ్, ఎన్నికల విభాగపు తహశీల్దార్ శ్రావణి, కలెక్టర్ ఏవో బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలంతా ఒకప్పటి పాఠశాల విద్యార్థులే

–కొండూరు శ్రీనివాసరాజు

రాయచోటి టౌన్.డిసెంబర్ 12 ప్రభాతవార్త

ప్రస్తుతం అంతర్జాతీయ శాస్త్రవేత్తలుగా కీర్తించబడుతన్న శాస్త్రవేత్తలంతా ఒక ప్పటి పాఠశాల విద్యార్థులేనని పిఆర్‌టియు రాష్ట్ర క్రమశిక్షణ సంఘం కన్వినర్ కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. ఈ నెల 12, 13 తేదీలలో జరగనున్న మం డల స్థాయి సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ కిరణ్ ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయ న మాట్లాడుతూ సైన్స్ పట్ల సానుకూల దృక్పదంతో అన్వేషిస్తూ పోయినప్పుడే కొత్త కొత్త ఆవిష్కరణ జరుగుతాయన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసు కుని భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ఆవిష్కరణలను కనిపెట్టాల న్నారు. నేడు మనం ఉపయోగించే అనేక రకాల సైన్స్ పరికరాలను మరింత మెరుగులుదిద్దుతూ అత్యంత ఖచ్చితత్వంతో సులభతరంగా నాణ్యమైన పరికరాల ను తయార చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో చిన్నమండెం మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రమేష్, మాసాపేట ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయులు శివకుమా ర్‌రెడ్డి, మహమ్మద్ హసీమ్, సైన్స్ ఉపాధ్యాయులు ఆంజనేయులు, రాజేంద్రప్ర సాద్, కృష్ణయ్య, సుబ్బయ్య, వాలూ నాయక్, మొహమ్మద్ అలీఖాన్, తోఫిక్, ఇందిరా ప్రియదర్శిని, ప్రశాంతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్ కలిగి ఉండాలి

పులివెందుల, డిసెంబరు 12, ప్రభాతవార్త :

విద్యార్థులు సాఫ్ట్‌వేర్ జాబ్స్‌కు అవసరయ్యే టెక్నికల్ స్కిల్స్ కలిగి ఉండాలని జేఎన్ టీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.శంకర శేఖర్ రాజు అన్నా రు. పులివెందుల జేఎన్‌టీ యూ ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజుల పాటు శిక్షణ కార్య క్రమం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, జావా, క్లౌడ్ కంప్యూటింగ్ నందు ఎడ్యు టెక్ కంపెనీ వారిచే ప్రస్తుతం నాల్గో సంవత్సరం చదువుతున్న బీటెక్ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ మురళి, అసిస్టెంట్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ ఎం.సాంబయ్య, వైస్ ప్రిన్సిపల్ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన పెద్దిరెడ్డి, వెంకటరమణారెడ్డిని పరామర్శించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం.డిసెంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని పడమటి కోన గ్రామం నడిగడ్డ పల్లికి చెందిన మండిపల్లి పెద్దిరెడ్డి, బోనమలకు చెందిన వెంకటరమణారెడ్డి గత వారంలో శబరిమలైకి వెళ్లి తిరిగి వస్తూ మార్గమద్యంలో తమిళనాడు పలని దగ్గర ప్రమాదవశాత్తు యా క్సిడెంట్ జరిగి గాయపడ్డారు. వారిని సోమవారం రాయచోటి నియోజకవర్గ టీడ ీపి నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తిరుపతిలో నారాయణాద్రి హాస్పిటల్ లో పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

జిల్లాలో కళకళలాడుతున్న ప్రాజెక్టులు

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉమ్మడి జిల్లాల యంత్రాంగం

రాజంపేట అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త



ఉమ్మడి జిల్లాలోని కడప, అన్నమయ్య జిల్లాల్లోని ప్రాజెక్టు లు నిండుకుండల్లా మారాయి. ప్రధాన ప్రాజెక్టులన్ని నిండిపో యాయి. వచ్చిన నీరు వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. జిల్లా లోనే పెద్ద ప్రాజెక్టు అయిన గం డికోట రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 26.850 టిఎంసిలు కాగా ప్రస్తుతం 26.256 టిఎంసిల నీరు నిల్వ ఉంది. మాండూస్ తుఫాను ప్రభావంతో ఎడతెరపిలేని వర్షాలతో ప్రాజెక్టుకు 3 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో 3 వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 10.200 టిఎంసిలు కాగా 9.482 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 1468 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 2580 క్యూసెక్కుల నీరు విడుద చేస్తున్నారు. మైలవరం రిజర్వాయర్ 6.500 టిఎంసిల సామర్థ్యం కాగా ప్రస్తుతం 5876 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 2892 క్యూసెక్కులు కాగా 3286 క్యూసె క్కులు విడుదల చేస్తున్నారు. పైడిపాళెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 6 టిఎంసిల నీరు నిల్వ సామర్థ్యం కాగా 5.603 టిఎంసిల నీరు నిల్వ ఉంది. తెలుగుగంగ ప్రాజెక్టులో కూడ 2.750 టిఎంసిల నీరు నిల్వ ఉంది. బ్రహ్మంసాగర్ రిజర్వా యర్ 17.735 టిఎంసిల పూర్తి నీటినిల్వ సామర్థ్యం కాగా 15.237 టిఎంసిల నీరు నిల్వ ఉంది. బుగ్గవంక ప్రాజెక్టులో 0.153 టిఎంసిల నీరు ఉంది. అన్నమ య్య జిల్లాలో వెలిగల్లు ప్రాజెక్టు నిండుగా ఉంది. మదనపల్లె నియోజకవర్గంలోని నిమ్మనపల్లె ప్రాజెక్టు కూడ 3 రోజుల క్రితం నిండింది. కాగా చెయ్యేరునదికి 2500 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది.

స్పందన వినతలు పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు

–ఆయా దరఖాస్తులు మళ్లీ పునరావృత్తం కాకుండా నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి

–డిఆర్‌వో సత్యనారాయణ

రాయచోటి.డిసెంబర్ 12 ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన ప్రజల్లో బలమైన నమ్మకాన్ని కలిగేలా ఎ ప్పటికప్పుడు పరిష్కారం చూ పాలని జిల్లా అధికారులను డిఆర్‌వో సత్యనారయణ ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో స్పందన ప్రజా సమస్యలను పరిష్కార వేదికలో డిఆర్‌వో సత్యనారాయణ జిల్లా నలుమూలల ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడు తూ స్పందన వినతులు పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు ఆయా శాఖల్లో తమ కింది స్థాయి అధికారులు వద్ద పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి బియాండ్ ఎస్ఎల్ఎలోకి ఏ ఒక్క అర్జీ వెళ్లకుండా అధికారులందరు బాద్యతతో సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం అర్థమయ్యే విధంగా అర్జీదారులకు పూర్తి వివరాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం

– ఏఎస్‌డబ్ల్యువో రామయ్య

బద్వేలు అర్బన్, డిసెంబరు 12 ప్రభాతవార్త :

బద్వేలు పట్టణంలోని ఎ స్సీ బాలుర వసతిగృహం–1 లో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వాణ హాస్పిటల్ డాక్టర్ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస హాస్పిటల్ డా॥ ధర్బగూటి వెంకట సదీప్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి సుమారు 160 మంది విద్యార్థులకు అవసరమైన రక్త పరీక్షలతో పాటు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులు అందజేశారు. అనంతరం డా॥ ముడమాల విష్ణువర్ధన్ రెడ్డి, దర్బగూటి వెంకట సందీప్‌లు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు నిరంతరాయంగా పడుతున్నా యని, వర్షాలలో విద్యార్థులు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా జలుబు, దగ్గు, జ్వరం లాంటి లక్షణాలు కనపడితే నిర్లక్ష్యం వహించకుం డా వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకొని ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పలువురు విద్యార్థులకు రక్త హీనత ఉన్నట్లు గుర్తించి వారికి పండ్లు, కోడిగుడ్లు, కూరగాయలు లాంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏఎస్‌డబ్ల్యువో రామయ్య, వార్డన్లు పాలా మధుసూదన్ రెడ్డి, సుభాష్ చంద్ర, లక్ష్మీదేవి, బాలమ్మ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు మరియు సాంఘీక సంక్షేమ శాఖలో ఉన్నటువంటి విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనతో పాటు పౌష్టికాహారం కూడా అందజేయడం జరిగిందని, జిల్లా కలెక్టర్ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సాంఘీక సంక్షేమ శాఖలో ఉన్నటువంటి సుమారు 160 మంది విద్యార్థులకు అనుభవ జ్ఞులైన వైద్యులతో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడం జరిగిందన్నారు. హాస్టళ్ళల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి మరియు ఏఎస్ఎంలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాండూస్ ప్రభావిత పంటల పరిశీలన

పెండ్లిమర్రి, డిసెంబరు 12, ప్రభాతవార్త:

పెండ్లిమర్రిలో మాండూస్ ప్రభావిత పంటలను మండల ఉద్యాన అధికారి సింధూరి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పంటలలో వాడే ఎరువులు, మందుల గురించి అవగాహన కల్పించారు. అధిక తేమ వల్ల పంటను ఆశించే వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగుళ్లు నివారణకు 1 లీటరు నీటికి 3 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా హెక్సాకోనజోల్ 2 మి.లీ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఇతర బ్యాక్టీరియా తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాము 0.1 గ్రా స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారి చేసుకోవాలని తద్వారా ఆకుమచ్చ, తాటాకు మచ్చ తెగుళ్లను నివారించవచ్చన్నారు. పసుపులో వర్షాలు తరువాత మురుగు నీ టిని బయటకు పంపాలన్నారు.కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోకుండా రసాయనాలు పిచికారి చేయండి

పులివెందుల, డిసెంబరు 11, ప్రభాతవార్త :

మాండౌస్ తుపాను కారణంగా కురిసిన వర్షాల వలన సాగులో ఉన్న పంట లు నష్టపోకుండా రసాయన మందులు పిచికారి చేయాలని పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చామంతి పంట లో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మచ్చ తెగులు నివారణకు క్లోరోథిలోనిల్ లీటరు నీటికి రెండు గ్రాములు లేదా ప్రాపికోనజోల్ లీటరు నీటికి 1మి.లీ. నీటిని కలుపుకుని పిచికారి చేయాలని తెలిపారు. ధనియాల పంటలో తెగులు నివారణకు కార్బండిజం లీటరు నీటికి ఒక గ్రాము కలిపి పిచికారి చేయాలన్నారు. అరటిలో అధిక తేమ వలన సిగటోకా తెగులు నివారణ కోసం గెల వేయని చెట్లకు ప్రాపికోనజోల్ లీటరు నీటికి 1మి.లీ చొప్పున పిచికారి చేయాలన్నారు. గెలవేసిన చెట్లకు క్లోరోథలోనిల్, డైఫెనకొనజోల్ లీటరు నీటికి 1.5మి.లీ కలిపి పిచికారి చేయాలని చెప్పారు. చీనీలో గజ్జితెగులు నివారణ కోసం కాపర్‌హైడ్రాక్సైడ్ లీటరు నీటికి 1మి.లీ. కలిపి పిచికారి చేయాలన్నారు.

నదీ ప్రవాహ ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

పీలేరు, డిసెంబరు 12 ప్రభాతవార్త:

పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలుపుతున్న సీఐ, సర్పంచ్

మండూస్ తుఫాన్ ప్రభా వంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజ లు అప్రమత్తంగా ఉండాలని సీఐ మోహన్‌రెడ్డి, సర్పంచి డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. సోమవారం పీలేరు పట్టణం సదుం రోడ్డు జేకే కాలనీ మసీదు వీధి, ఆకులవారిపల్లె తదితర ప్రాం తాల్లో పర్యటించి ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం పింఛా నది ప్రవాహానికి ఇల్లు కూడా కొట్టుకుపోయాయని, పింఛానది పక్కన ఉన్న ప్రజ లు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదీ ప్రవాహ ప్రాంతాల్లో ఎవరు దిగకూడదని హెచ్చరించారు. ఏవైనా ప్రమాదాలు జరిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఈఓ రెడ్డి ప్రసాద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని ప్రతి ఒక్కరు పరిరక్షించాలి

వేంపల్లె, డిసెంబరు 12, ప్రభాతవార్త :

మొక్కలు నాటుతున్న కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, బ్రహ్మకుమారీలు

ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించా లని, ఇందుకోసం ఒక మొక్క అయినా నాటి పర్యావరణాన్ని కాపాడాలని వేంపల్లె బ్రహ్మకు మారి సేవకేంద్రం ఇన్‌ఛార్జి విజయ పేర్కొన్నారు. వేంపల్లెలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో వేంపల్లె ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఓంశాంతి) బ్రహ్మకు మారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్పతరు అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో మౌంట్‌అబు రాజస్థాన్ నుండి విచ్చేసిన సుమంత్, సుప్రి య కలిసి మొక్కల్ని నాటి పిల్లల